క్లుప్తంగా

దాత కంకిపాటి చంటి కన్నుమూత


కంకిపాటి వీరభద్రరావు (ఫైల్)

తాళ్లపూడి: మండలంలోని తాళ్లపూడికి చెందిన దాత కంకిపాటి వీరభద్రరావు (చంటి) (84) గురువారం వయోభారంతో కన్నుమూశారు. ఈయన గత ఐదు దశాబ్దాలుగా ఎరువుల వ్యాపారిగా రైతులకు సుపరిచితులు. పేద రైతులకు అండగా ఉండేవారని పలువురు కొనియాడారు. ఈయనకు కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. వేసవిలో పలు ప్రాంతాల్లో చలువ పందిళ్లు వేసి, చల్లటి తాగు నీరు పంపిణీ చేసేవారు. ఉభయ గోదావరి జిల్లాలోని పలు గ్రామాల్లో ప్రయాణికులు కూర్చునేందుకు, గ్రామస్తుల విశ్రాంతి కోసం వందల సంఖ్యలో సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. పలు ఆలయాలకు, సేవా కార్యక్రమాలను తనవంతు సాయం అందించేవారు. ఆయన మరణానికి పలువురు ప్రముఖులు, ఆర్యవైశ్య పెద్దలు, రైతులు సంతాపం ప్రకటించారు.

పేద రోగులకు భోజన వితరణ


రోగులకు ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న సాయిబాబు తదితరులు

నిడదవోలు : పేద రోగులకు సేవ చేయడంలో నిజమైన ఆత్మ సంతృప్తి లభిస్తుందని రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ మాజీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు అన్నారు. నిడదవోలు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సాయిబాబు, భగవతి దంపతుల కుమారుడు సంపత్ సత్యవరప్రసాద్ జన్మదినం సందర్భంగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో గురువారం 80 మంది రోగులు, వారి సహాయకులకు భోజనం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు కోటిపల్లి పండు, కేదారిశెట్టి రవికుమార్, చిక్కాల రాజా, సానేపు వెంకట సుబ్బారావు, ఎండీ ఫయాజ్, గిద్దా వేణు, సందీప్, కందగట్ల అయ్యప్పగుప్తా తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన పాఠశాల పరిశీలన


ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

తాళ్లపూడి: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పోచవరంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణం నీట మునిగింది. విద్యార్థులు ఇబ్బంది పడుతుండడంతో గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ కొండేపాటి రత్నకుమారి.. ఎంపీపీ, ఎంపీడీఓలకు సమాచారమిచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, ఎంపీడీఓ టీబీ వెంకటరమణ తదితరులు పాఠశాలను పరిశీలించారు. పాఠశాల ప్రాంతం పల్లంగా ఉండడంతో వర్షపు నీరు వెళ్లడం లేదని, ప్రాంగణం లెవెలింగ్ చేయించాలని హెచ్ఎం డి.దుర్గారావు వారికి వివరించారు. దీనిని ఎమ్మెల్యే, సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని ఎంపీపీ హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి ఈఎస్ రామలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు కొండేపాటి కాశీవిశ్వనాథ్, ఈర్లగడ్డ ఆకాష్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

నల్లజర్ల/నిడదవోలురూరల్/కొవ్వూరు/ దేవరపల్లి/పెరవలి: సబ్ స్టేషన్ల మరమ్మతుల కోసం పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. ప్రకాశరావుపాలెం, సింగరాజుపాలెం, గుండేపల్లి, సంజీవపురం సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేపడుతున్నారు. ఆయా గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు. వ్యవసాయ బోర్లకు ఉదయం 5 నుంచి 9 గంటల వరకుచ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 వరకు సరఫరా ఇవ్వనున్నట్టు చెప్పారు. బసివిరెడ్డిపేట సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శెట్టిపేట, తాళ్లపాలెం, సమిశ్రగూడెం, అట్లపాడు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుంది. కానూరు, పెరవలి సబ్ స్టేషన్ల పరిధిలో మల్లేశ్వరం, ఉసులుమర్రు ఫీడర్లపై మరమ్మతుల కోసం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. కానూరు, నడుపల్లి, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, అన్నవరప్పాడు, మల్లేశ్వరం, పిట్టల వేమవరం, ఖండవల్లి, నల్లాకులవారిపాలెం గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదు. కొవ్వూరు పట్టణంలో 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కోసం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఏర్పడుతుంది. గౌతమీ నగర్, ఫ్యాక్టరీ రోడ్డు, మెయిన్‌రోడ్డు, జూనియర్ కళాశాల ఏరియా, శ్రీనివాసపురం, క్రిస్టియన్‌పేట, రాజీవ్ కాలనీల్లో విద్యుత్ ఉండదు.దేవరపల్లి సబ్‌స్టేషన్‌లో బందపురం ఫీడర్‌కు, రామన్నపాలెం సబ్‌స్టేషన్‌లో బుచ్చియపాలెం ఫీడర్, దేచర్ల సబ్‌స్టేషన్‌లోని ఎస్ఎంసీఎల్, త్రివేణి ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుంది.

అన్నదాత గుండెకోత

- ఎర్ర కాలువ వరదతో కోతకు గురవుతున్న పంట భూములు
- కళ్లెదుటే పంటలు, భూములు కోల్పోతున్న రైతులు
- ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన


ఎర్ర కాలువ వరదకు గుండేపల్లిలో బోరు మినహా సాగుభూమి లేని రైతు శ్రీహరిరాజు పొలం

నల్లజర్ల: ఎర్ర కాలువ పరివాహక ప్రాంతంలో ఏటా వచ్చే వరదలకు పంటతో పాటు, భూమి కూడా కోతకు గురవుతుండడం రైతాంగాన్ని కలవరపరుస్తోంది. పంట కోల్పోతే మళ్లీ వేసుకోవడమో లేదా ఆ ఏడాది నష్టం వచ్చిందని రైతులు సరిపెట్టుకునేవారు. కానీ, కొన్నాళ్లుగా సుభద్రపాలెం, పోతవరం, నబీపేట, అనంతపల్లి, గుండేపల్లి గ్రామాల్లో ఇటీవల కాలంలో ఎర్రకాలువ పక్కనున్న భూములు భారీగా కోతకు గురవుతున్నట్టు రైతులు చెబుతున్నారు.

ఎర్ర కాలువ వరదతో..

ఏటా జూన్ నుంచి సెప్టెంబరు వరకు ఎర్రకాలువకు వరదలు వస్తుంటాయి. ఆ సమయంలో భూముల్లో ఉన్న వరి, కూరగాయల సాగుతో పాటు, వివిధ రకాల పంటలు వరదలకు మునిగి, ఏడాదంతా పడ్డ శ్రమ వృథా అవుతోంది. ఏటా వరదలకు పచ్చని పంటలతో కళకళలాడుతున్న భూములు కోతకు గురవుతున్నాయి. ఒక్క గుండేపల్లి గ్రామంలోనే అత్యధికంగా చిన్న రైతులకు చెందిన ఐదెకరాల వరకు కోతకు గురైంది. ఉన్నమట్ల సూర్యచంద్రం అరెకరం, శ్రీహరిరాజు అరెకరం, జొన్న ఆంజనేయులు 30 సెంట్లు, జొన్న వెంకటేశ్వరావు 40 సెంట్లు, కోతారు వీర్రాజు అరెకరం, అనంతపల్లిలో కాశీభట్ల రాంగోపాలశర్మ 2 ఎకరాలు, అంబటి సత్యవతిది గతంలో ఎకరం కొట్టుకుపోగా, ఇపుడు రెండు ఎకరాలు కోతకు గురైంది.


అనంతపల్లిలో ఎర్ర కాలువ వరదకు కోతకు గురైన రైతు కాశీభట్ల రాంగోపాలశర్మ పొలం

ప్రత్తి శ్రీనుబాబు అరెకరం, బోయపాటి రమేష్ 2.70 ఎకరాలు, కరుటూరి రాజారావు అరెకరం, కారుమంచి మధు 1.50 ఎకరాలు, నబీపేటలో కొండపనేని చంద్రరావు 1.50 ఎకరాలు, చింతపల్లి కుమార్రాజు అరెకరం, చింతపల్లి భూషయ్య 1.50 ఎకరాల భూమి కొట్టుకుపోయినట్టు రైతులు చెబుతున్నారు. ఆరుగాలం కష్టపడే తమ కళ్లెదుటే భూములిలా కొట్టుకుపోతుంటే, చేసేదేమీ లేక చూస్తూ ఉండిపోతున్నామని కన్నీటి పర్యంతమవుతున్నారు. నబీపేట వద్ద కాలువకు అడ్డుకట్ట (గ్రోయిన్) ఉండేది. అక్కడ్నుంచి పంట కాలువల ద్వారా కొంతనీరు పొలాలకు వెళ్లేది. రెండు దశాబ్దాల క్రితం గ్రోయిన్ కొట్టుకుపోయింది. అప్పటి నుంచి ఎర్ర కాలువకు వరద వచ్చినప్పుడల్లా ఇలా భూములు కొట్టుకుపోవడం పరిపాటిగా మారింది.

గట్లు పటిష్ట పర్చాలి



ఎర్రకాలువకు ఎక్కడ వరద గట్లు లేవు.గట్లు పటిష్టపర్చాలి.చిరంజీవి కేంద్రమంత్రిగా ఉండగా అనంతపల్లి బ్రిడ్జి దిగువ నుండి నందమూరు అక్విడెట్ వరకు కాలువ వెడల్పు చేసారు.అదే విధంగా పోతవరం బ్రిడ్జి నుండి కాలువ వెడల్పు చేయాలి. గట్లు పటిష్టపర్చాలి.

– జి.శ్రీహరి రాజు, రైతు.గుండేపల్లి

కొన్న భూమి కళ్లెదుటే..



పూర్వపు ఆస్తులు కొన్ని అమ్మి కొన్న భూమి కొంతైతే, మా భార్యాభర్తలు కష్టపడి కూలీకి వెళ్ళి మరికొంత భూమి కొనుగోలు చేసాం.ఇదంతా కళ్ళముందే కరిగిపోతుంటే.. గతంలో కొంత కోతకు గురైంది.ఈఏడాది వరదలకు మిగతాది కొట్టుకుపోయింది. ఉన్న ఆసరా పోయింది.బతికేది ఏలా?

– అంబటి సత్యవతి, రైతు.అనంతపల్లి

విశాలంగా.. వంపులు లేకుండా..



కాలువ ప్రవాహ వేగం తగ్గాలి. అందుకు తగిన చర్యలు చేపట్టాలి. కాలువ వంకర్లు లేకుండా, వెడల్పు ఎక్కువగా ఉంటే భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. కాలువ పరివాహక ప్రాంతం అంతటా చెట్లు పెంచాలి. గడ్డి జాతి మొక్కల పెంపకాన్ని ప్రోత్సహించాలి. విభిన్న నేల సంరక్షణ పద్ధతులు అవలంబిస్తే, భూములు కోతకు గురికాకుండా ఉంటాయి. ఇలా ఏటా వరదలకు భూములు కోతకు గురవుతుంటే, భూమిపై ఉన్న జీవ వైవిధ్యానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముంది.

– పి.వెంకటేశ్వరావు, పర్యావరణ వేత్త, అధ్యాపకులు, డైట్ కళాశాల, దూబచర్ల

ఎస్సై సుబ్రహ్మణ్యం బాధ్యతల స్వీకరణ



దేవరపల్లి: బదిలీపై దేవరపల్లి ఎస్సైగా వచ్చిన వి.సుబ్రహ్మణ్యం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కె.శ్రీహరిరావు కొవ్వూరు రూరల్‌కు బదిలీ కావడంతో, ఈ స్థానంలో తాడేపల్లిగూడెంలో ట్రాఫిక్ ఎస్సై సుబ్రహ్మణ్యాన్ని నియమించారు.

రక్తదానంతో ప్రాణదాత కండి


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

కొవ్వూరు: విద్యార్థులు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని, తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి రక్తదానం చేయడం అవసరమని ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ సుబ్బారావు అన్నారు. కళాశాలలో గురువారం విద్యార్థులు, సిబ్బంది రక్తదాన శిబిరం నిర్వహించారు. జీఎస్టీ దినోత్సవం సందర్భంగా జీఎస్టీ అధికారులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని ప్రిన్సిపాల్ ప్రారంభించారు. జీఎస్టీ సూపరింటెండెంట్ బి.రవిచంద్రమూర్తి, రెడ్ క్రాస్ సిబ్బంది డాక్టర్ రామ్మోహన్‌ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ వై రమేష్, కె.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు జల జీవనమే..

- ఇళ్లల్లోకి చేరిన ముంపు నీరు
- కొవ్వాడ రిజర్వాయర్ నుంచి వరద నీరు
- దొండపూడి, సాగిపాడు గ్రామాల రాకపోకలకు అంతరాయం
- అల్లి కాలువ ఉధృతికి స్తంభించిన వాహనాలు


వేగేశ్వరపురంలో వేంకటేశ్వర స్వామి ఆలయం చుట్టూ ముంపు నీరు

గోపాలపురం: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గోపాలపురం మండలంలోని వివిధ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దొండపూడి, సాగిపాడు గ్రామాల మధ్య కొవ్వాడ రిజర్వాయర్ నుంచి విడుదలైన వరద నీటికి రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అల్లి కాలువ ఉధృతంగా ప్రవహించడంతో కరగపాడు, కొవ్వూరుపాడు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బుధ, గురువారాల్లో కురిసిన భారీ వర్షాలకు గోపాలపురం మండలం దొండపూడి, రాజంపాలెం గ్రామాల మధ్య వరద నీరు ఇళ్లలోకి చేరింది. రాత్రంతా కంటిమీద కునుకు లేకుండా గడిపినట్టు బాధితులు తెలిపారు. దొండపూడి, సాగిపాడు గ్రామాల మధ్య ,కరగపాడు, కొవ్వూరుపాడు గ్రామాల మధ్య ప్రవహిస్తున్న వరద కాలువల వద్ద పోలీసులు, రెవెన్యూ అధికారులు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కాపలా కాస్తున్నారు.


దొండపూడి-సాగిపాడు రోడ్డులో కొవ్వాడ కాలువ వద్ద గస్తీలో ఉన్న పోలీసులు, అధికారులు

పల్లపు ప్రాంతాలు జలమయం

తాళ్లపూడి: మండలంలో గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. వర్షపాతం 126 మి.మీ. నమోదైంది. గురువారం ఉదయం నుంచీ ఆకాశం మేఘావృతమై ఉంది. భారీ వర్షంతో పలు గ్రామాల్లో రహదార్లపై, పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. స్థానిక గ్రంథాలయం వీధిలో సీసీ రోడ్డు జలమయమైంది. వేగేశ్వరపురంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం చుట్టూ ముంపు నీరు నిలిచింది.


తాళ్లపూడిలో నీట మునిగిన గ్రంథాలయం వీధి

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

దారవరంలో చైర్మన్‌గా వైఎస్సార్ సీపీ కార్యకర్త


దారవరంలో చైర్మన్‌గా ఎన్నికైన పెదబాబును సత్కరిస్తున్న సర్పంచ్ రవిప్రసాద్ తదితరులు

చాగల్లు: మండలంలో అన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు గురువారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. అన్ని పాఠశాలల్లో ఓటర్లు ఆసక్తిగా ఎన్నికలల్లో పాల్గొన్నట్టు ఎంఈఓ సుభాకర్ తెలిపారు. చాగల్లు మండలంలో 38 పాఠశాలల్లో 22 చోట్ల ఏకగ్రీవంగా చైర్మన్, వైస్ చైర్మన్లు ఎన్నికైనట్టు చెప్పారు. మొత్తం 16 పాఠశాలల్లో ఓటింగ్ ద్వారా చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారు. వీరిలో చైర్మన్లుగా 12 మంది మహిళలు, 26 మంది పురుషులు, వైస్ చైర్మన్లుగా కేవలం ఏడుగురు పురుషులు, 31 మంది మహిళలు ఎన్నికయ్యారు. మొత్తం 563 మంది కమిటీ సభ్యులతో మండలంలోని అన్ని పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు హెచ్ఎంల సహకారంతో విజయవంతంగా నిర్వహించినట్టు ఎంఈఓ తెలిపారు.

దారవరంలో..

ఇలాఉండగా దారవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఎస్ఎంసీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్త పల్లి పెదబాబు చైర్మన్‌గా విజయం సాధించారు. వైస్ చైర్‌పర్సన్‌గా దయ్యాల లావణ్య ఎన్నికయ్యారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పెదబాబు అన్నారు. సర్పంచ్ మద్దుకూరి రవిప్రసాద్ ఆయనను సత్కరించారు. అనంతరం వైఎస్సార్, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు.

ఎస్ఎంసీ ఎన్నిక ఏకగ్రీవం

ఉంగ్రాజవరం: మండలంలోని 32 ప్రాథమిక పాఠశాలలు, 8 ఉన్నత పాఠశాలలకు గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించినట్టు ఎంఈఓలు సక్సేనా రాజు, శారద జ్యోత్స్న తెలిపారు. ఈ ఎన్నికల్లో 40 పాఠశాలల నుంచి చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు చెప్పారు. ఉండ్రాజవరం హైస్కూల్ చైర్మన్‌గా పి.రాము, వేలివెన్ను చైర్మన్‌గా కరుటూరి గంగాభవాని, మోర్త చైర్మన్‌గా ఆకుల నర్సింహారావు, సూర్యారావుపాలెం చైర్మన్‌గా ఎన్.అరుణ, వడ్లూరు చైర్మన్‌గా గుడాల ఏడుకొండలు, సత్యవాడ చైర్మన్‌గా జానా నాగబాబు, చివటం చైర్మన్‌గా ఎల్.రజని, తాడిపర్రు చైర్మన్‌గా అరిగెల నాగేశ్వరరావుతో పాటు, 32 ప్రాథమిక పాఠశాలలకు చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సభ్యులు ఎన్నికైనట్టు వివరించారు.

45 పాఠశాలల్లో..

దేవరపల్లి: మండలంలోని 45 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాతంగా జరిగినట్టు ఎంఈఓ ఎం.తిరుమలదాస్ తెలిపారు. 34 ప్రాథమిక పాఠశాలలు, 9 జెడ్పీ స్కూళ్లకు ఎన్నికలు జరిగాయి. వీటిలో ఎనిమిది ప్రాథమిక పాఠశాలలు, మూడు హైస్కూళ్లు, ఒక ప్రాథమికోన్నత పాఠశాలలో ఎన్నికలు జరిగాయని, మిగిలిన పాఠశాలల్లో కొన్ని తరగతులు ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయని ఎంఈఓలు తిరుమలదాస్, కేఆర్ఎస్‌వీవీ అప్పారావు తెలిపారు. పల్లంట్ల జెడ్పీ స్కూలు ఎన్నికలో వైఎస్సార్ సీపీ ప్రోద్బలంతో కమిటీ చైర్మన్‌గా నలమాటి యామినీ, వైస్ చైర్మన్ కడిమి మహేష్ ఎన్నికయ్యారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం

మంత్రి కందుల దుర్గేష్


సమిశ్రగూడెంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు రూరల్: నియోజకవర్గంలో ఉపాధిహామీ పథకం నిధులు రూ.11 కోట్లతో సీసీ రోడ్లకు ప్రాధాన్యమిస్తున్నట్టు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సమిశ్రగూడెంలో రూ.20.52 లక్షలు, గోపవరం రూ.8.70 లక్షలు, పురుషోత్తపల్లి రూ.29.44 లక్షలు, పందలపర్రు రూ.18.60 లక్షలు, డి.ముప్పవరంలో 16.80 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు గురువారం శంకుస్థాపనలు చేశారు. సర్పంచులు దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక, ఆరేపల్లి భాగ్యలక్ష్మి, నేలపూడి నాగమణి, వైస్ ఎంపీపీ వడల రత్నకుమారి, పంచాయతీరాజ్ ఎస్ఈ ఎండీ ఆలీముల్లా, డీఈఈ కె.రామ్మోహన్, ఏఈ సీహెచ్ఎస్ఆర్‌కే శాస్త్రి, ఎంపీడీఓ జేఏ ఝాన్సీపాల్గొన్నారు.

పెరవలి: కానూరు, నడుపల్లి, కానూరు అగ్రహారం, తీపర్రు గ్రామాల్లో నిర్మించనున్న రోడ్లకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. సర్పంచ్‌లు భావన మధు, బీరా సత్యవేణిరాజు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: పాలంగి, కె.సావరం, చివటం, వడ్లూరు, సూర్యారావుపాలెంల్లో సీసీ రోడ్లకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, జి.వెంకటసుబ్రహ్మణ్యం, సర్పంచులు నార్ని రామకృష్ణ, బి.శ్రీనివాసు, ఈదుపుగంటి సత్యనారాయణ, మెండే లలితకుమార్ది పాల్గొన్నారు.

బిడ్డలకు తల్లిపాలు అమృతం

నిడదవోలు: తల్లిపాలు బిడ్డలకు అమృతంతో సమానమని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలో వేంకటేశ్వర కల్యాణ మండపంలో గురువారం తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ డబ్బా పాలు కాకుండా, ప్రతి తల్లి కేవలం తల్లిపాలే పట్టాలన్నారు. రాబోయే తరాలకు తల్లులు ఆదర్శంగా ఉండాలన్నారు. జిల్లా శిశు సంక్షేమ శాఖ పీడీ కె.విజయకుమారి మాట్లాడుతూ తల్లిపాలు తాగిన పిల్లల్లో ఐక్యూ స్థాయి అధికంగా ఉంటుందన్నారు. నెహ్రూనగర్ యూహెచ్‌సీ వైద్యాధికారి ఈ. తేజశ్రీ మాట్లాడుతూ ముర్రిపాల వల్ల చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యంతో పాటు, రోగ నిరోధక శక్తి పెరుగుతోందన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా సేవా కోఆర్డినేటర్ రంగా వెంకటేశ్వరావు ఆర్థిక సహకారంతో 20 మంది గర్భిణులకు పౌష్టికాహారం అందించి, సామూహిక సీమంతాలు చేశారు. ప్రతి తల్లికి రూ.వెయ్యి చొప్పున అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పిల్లల్ని చేర్చకుండానే చైర్మన్

ఇదీ టీడీపీ నేతల నిర్వాకం !

నల్లజర్ల: ఎస్ఎంసీ ఎన్నికల్లో టీడీపీ నిర్వాకాలు ఒక్కొక్కటిగా బహిర్గతమవుతున్నాయి. మండలంలోని తూర్పుచోడవరం స్పెషల్ స్కూల్‌లో గురువారం నిర్వహించిన ఎస్ఎంసీ ఎన్నికల్లో టీడీపీ నాయకులతో పాటు, ఉపాధ్యాయులు అక్రమాలకు పాల్పడ్డారని అదే స్కూల్ గత కమిటీ చైర్మన్ కత్తుల రమేష్ విలేకర్లకు తెలిపారు. గ్రామానికి చెందిన కరుటూరి సురేష్‌కు ఒక పాప, బాబు ఉన్నారు. వారు మరో గ్రామంలో చదువుతున్నారు. ముందు అనుకున్నట్టుగా టీడీపీ వర్గానికి చెందిన కలిగినీడి సుధ కనీసం సభ్యునిగా కూడా ఎంపిక కాలేదు. దీంతో ఏం చేయాలో తెలియక సురేష్‌ను రంగంలోకి దించారు. మరో వర్గంలో ఎంపికైన 9 మంది సభ్యుల్లో ఐదుగురిని బెదిరించి, టీడీపీకి మద్దతు కూడగట్టుకున్నారు. తప్పుడు విధానంలో కరుటూరి సురేష్‌ను చైర్మన్‌గా ఎంపిక చేశారు మినహా, అతనితో ప్రమాణ స్వీకారం కూడా చేయించలేదు. దీనిపై ఎంఈఓకు ఫిర్యాదు చేసినట్టు రమేష్ తెలిపారు.

ఎన్నికల్లో టీడీపీ నేతల హల్‌చల్

- సక్రమంగా జరిగినా, అక్రమమే అట!
- జగన్నాథపురంలో ఎన్నిక తీరిది


వేగేశ్వరపురంలో ఎస్ఎంసీ కమిటీ ఎన్నికల్లో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు


అన్నదేవరపేట జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద కూటమి నాయకుల హడావిడి

నల్లజర్ల: ఎస్ఎంసీ ఎన్నికల నేపథ్యంలో కొన్నిచోట్ల టీడీపీ నేతలు గొడవలకు దిగిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. మండలంలోని జగన్నాథపురం ఆర్‌సీఎం స్కూలులో గురువారం జరిగిన ఎస్ఎంసీ ఎన్నిక సక్రమంగా జరిగినా, సాయంత్రం తీరిగ్గా వచ్చిన టీడీపీ నేతలు.. ఈ ఎన్నిక చెల్లదంటూ హెచ్ఎం నాగలక్ష్మిపై గొడవకు దిగారు. తాను సక్రమంగానే చేశానంటూ హెచ్ఎం స్పష్టం చేశారు. ఉదయం సర్పంచ్ చెల్లారి రామశ్రీనివాస్‌తో పాటు, 30 మంది తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చారు. ఐదు తరగతులకు 15 మందిని సభ్యులుగా ఎంపిక చేశారు. వీరిలో నరెడ్ల సుమను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం కూడా చేయించారు. ఈ తతంగమంతా పూర్తయ్యాక పలువురు టీడీపీ నేతలు అక్కడకు వచ్చి, తల్లిదండ్రులందరికీ సమాచారం లేదని, ఈ ఎన్నిక చెల్లదంటూ హంగామా చేశారు. అందుకు హెచ్ఎం ఎంతమాత్రం తలొగ్గక, తాను చేసింది సక్రమమేనని స్పష్టం చేశారు. తెలికిచెర్ల జెడ్పీ హైస్కూలులో ముందుగానే టీడీపీ నేతలు పాలకవర్గం ఖరారు చేసేశారు. ఉదయం 10 గంటలకు పాఠశాలకు వెళ్లిన తల్లిదండ్రులతో ఈ ఎన్నిక ప్రక్రియ పూర్తయిందంటూ వెనక్కి పంపేశారు. ఇదేమిటని ప్రశ్నించిన తల్లిదండ్రులకు, మీరేం ఓట్లు వేయనక్కరలేదని చెప్పారు. ఈ విషయం ఎంఈఓ దృష్టికి రాగా, ఆయన ఫోన్ చేసి ఆరాతీశారు. అంతా సక్రమంగానే జరిగిందంటూ హెచ్ఎం మురళీకృష్ణ సమాధానమిచ్చారు. అలాగే అనంతపల్లి ప్రాథమిక పాఠశాల-3లో కూడా ఎన్నిక వివాదాస్పదమైంది. ముందుగా కొందరి పేర్లు సభ్యులుగా నమోదు చేయడం, కొంత సమయం తర్వాత వాటిని కొట్టివేసి, వేరే పేర్లు రాయడం వివాదాస్పదమైంది. విషయం తెలిసి అక్కడకు వెళ్లిన ఎంఈఓ సర్దుబాటు చేశారు. సుభద్రపాలెంలో హెచ్ఎం సెలవుపై ఉండటంతో, ఎంఈఓ సత్యనారాయణ అక్కడకు వెళ్లి ఎన్నిక నిర్వహించారు. 9 జెడ్పీ హైస్కూళ్లు, 4 యూపీ, 3 ఎయిడెడ్, 40 ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికలు జరిగాయి. వివాదాస్పదమైన జగన్నాథపురంలో ఎన్నిక జరగలేదని విద్యాశాఖాధికారి చెప్పారు.

టీడీపీ నాయకుల అవరోధాలు

తాళ్లపూడి: మండలంలోని పాఠశాలల వద్ద ఉదయం నుంచి టీడీపీ నాయకులు హడావిడి చేశారు. వేగేశ్వరపురం, తాళ్లపూడి, అన్నదేవరపేట తదితర గ్రామాల్లో కూటమి నాయకుల హంగామా అంతాఇంతా కాదు. అన్నదేవరపేట జెడ్పీ హైస్కూల్‌లో ఇద్దరు చైర్మన్ పదవికి పోటీ పడ్డారు. వైఎస్సార్ సీపీ బలపర్చిన మెట్టి అనంతలక్ష్మి దాదాపు గెలుపు ఖాయమనే దశలో టీడీపీ నాయకులు ఈ ఎన్నిక విషయంలో వివాదం లేవనెత్తారు. దీంతో ఎన్నిక కొంత సేపు నిలుపుదల చేశారు. పాఠశాల అభివృద్ధికి తాము సహకరిస్తామని వైఎస్సార్ సీపీ నాయకులు చెప్పడంతో, పరస్పర చర్చల అనంతరం ఉపాధ్యాయులు ఎన్నిక కొనసాగించారు. ఇలాఉండగా మండలంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఎస్ఎంసీ చైర్మన్, ఇతర సభ్యులను ఎన్నుకున్నట్టు ఎంఈఓ సీహెచ్ బాలామణి తెలిపారు. మండలంలోని ఆరు ఉన్నత, 26 ప్రాథమిక పాఠశాలల్లో కమిటీలను ఎన్నుకున్నట్టు చెప్పారు.

యూనిఫారం పంపిణీ

నల్లజర్ల: శ్రీవెంకటేశ్వర క్లాత్ షోరూమ్ అధినేత రాయుడు పాపారావు సౌజన్యంతో స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థినులకు గురువారం రూ.లక్ష విలువైన యూనిఫారాలు అందజేశారు. మూడేళ్లుగా ఇక్కడి విద్యార్థినులకు ఆయన ఉచితంగా యూనీఫారాలు అందజేస్తున్నారు.